సచివాలయాలపై చిన్నచూపు

సచివాలయ వ్యవస్థను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

సిబ్బందిపై పనిభారం పెంచేందుకు యత్నాలు

వలంటీర్ల సేవలకు తూట్లు

ప్రజలకు మరింత దూరం కానున్న సేవలు



అల్లిపురంలో వార్డు సచివాలయం

సచివాలయాలు ఇలా..

జీవీఎంసీ పరిధిలో 98 వార్డులున్నాయి. ఒక్కో వార్డులో నాలుగు నుంచి ఐదు సచివాలయాలు సేవలందిస్తున్నాయి. ఒక్కో సచివాలయంలో 8 నుంచి 9 మంది సిబ్బంది ఉన్నారు. అంటే 98 వార్డుల్లో సుమారుగా 390 వరకు సచివాలయాలు ఉండగా.. మూడు వేల మందికి పైగా సచివాలయ సిబ్బంది వివిధ విభాగాల ద్వారా సేవలందిస్తున్నారు.

నిర్వీర్యం.. నిర్లక్ష్యం

సచివాలయ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. సచివాలయ ఉద్యోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఒక్కో సచివాలయానికి ఒక మహిళా పోలీస్, వెల్ఫేర్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ, యుటిలిటీస్, వీఆర్వో, ప్లానింగ్ సెక్రటరీ, ఏఎన్ఎమ్ ఇలా 8 నుంచి 9 మంది సిబ్బంది ఉండేవారు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. దీనిలో భాగంగానే ఒక సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి అదనంగా మరో సచివాలయం చూసుకోవాలని, అందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రస్తుతం మ్యాపింగ్ జరుగుతోంది.

మరింత పనిభారం..

టౌన్ ప్లానింగ్ సెక్రటరీలకు పనిభారం మరింత పెరుగుతోంది. 2024–25 మార్చి మాసాంతానికి ఆస్తి పన్ను.. వాటర్ ట్యాక్స్.. ఖాళీ స్థలాల పన్ను.. ట్రేడ్ ట్యాక్స్.. వృత్తి పన్ను.. ఇలా జీవీఎంసీ ఆధ్వర్యంలో వసూలు చేసే పన్నుల పనులతో సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలపై మరింత భారం పడనుంది.

డాబాగార్డెన్స్: అన్ని ప్రభుత్వ శాఖల సేవలు.. సంక్షేమ పథకాలు ఒకే చోట అందుబాటులో ఉంచడం ద్వారా పరిపాలన వికేంద్రీకరించడానికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు స్థానికులకు ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ ఫలాలు తూచ తప్పకుండా అందేవి. అందుకు వార్డు వలంటీర్లను కూడా నియమించింది. గ్రామాల స్వయం సమృద్ధి.. స్వయంప్రతిపత్తి గల సంస్థలుగా మారడాన్ని ప్రోత్సహించే మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే వలంటీర్ల సేవలకు తూట్లు పొడిచింది. గ్రామ స్వరాజ్యాన్ని గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన సంక్షేమ ఫలాలు అమలు చేయకపోవడం ఒక ఎత్తయితే.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను నీరుగారుస్తోంది. సచివాలయాలను చిన్నచూపు చూస్తోంది. అందుకు నిదర్శనమే గ్రామాలు/నగరాలు/వార్డుల్లో నత్తనడకన సాగుతున్న పనులు.. ఎక్కడికక్కడ పారిశుధ్య లోపం.. కనపడని విద్యా, వైద్య సేవలు.. ఇలా ఒకటేంటి అన్ని రకాల సేవలు మూలకు చేరుతున్నాయి. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రజలకందాల్సిన సంక్షేమం లేదు. ఆరోగ్య సేవలందడం లేదు.

ఇదే జరిగితే..

2 వేల నుంచి 3 వేలకు జనాభా గల ఒక సచివాలయ పరిధికి సంబంధించి ఉన్న సిబ్బందిని 5 వేల నుంచి 6 వేల జనాభా గల సచివాలయ పరిధికి పెంచనున్నారు. ఫలితంగా ఇప్పటికే అరకొరగా ప్రజలకు అందుతున్న సేవలు మరింత క్లిష్టంగా మారనున్నాయి.

ప్రాంగణ ఎంపికలో విద్యార్థినుల ప్రతిభ



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), శ్రీచైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పలువురు విద్యార్థినులు ప్రతిభ చూపి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల నియామక పత్రాలు అందజేశారు. 13 మంది విద్యార్థినులు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, జేకేసీ కో ఆర్డినేటర్ ఎం.విద్యాకల్పన, శ్రీచైతన్య విద్యా సంస్థల కో ఆర్డినేటర్ రామారావు, చంద్రశేఖర్, కళాశాల జేకేసీ మెంటర్‌లు ప్రజ్ఞ, వీఎస్ రాజు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసగించిన తల్లి, కొడుకు అరెస్ట్

అల్లిపురం: అల్లిపురం పరిసర ప్రాంతాల్లో చిట్టీల పేరుతో సుమారు కోటి రూపాయల మోసానికి పాల్పడి తప్పించుకు తిరుగుతున్న తల్లీ, కొడుకులను టూ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిపురం పరిసర ప్రాంతాల్లో 40 మంది నుంచి చిట్టీల పేరుతో కోటి రూపాయల వరకు వసూలు చేసి పరారైన కోరుకొండ మహేశ్వరి, ఆమె కొడుకు సన్యాసిరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

లేపాక్షిలో క్లియరెన్స్ సేల్‌కు విశేష స్పందన



లేపాక్షి ఎంపోరియంలో రాయితీ ధరలకు విక్రయిస్తున్న హస్తకళల ఉత్పత్తులు

డాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ సమీపాన గల లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంలో వార్షిక క్లియరెన్స్ సేల్.. ఉగాది డిస్కౌంట్ సేల్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అన్ని హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 40 శాతం తగ్గింపు ధరలకే విక్రయిస్తున్నట్టు ఎంపోరియం మేనేజర్ కార్తీక్ కుమార్ తెలిపారు. ఏపీహెచ్‌డీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ఉగాది పండగ సీజన్‌లో సాటిలేని ధరలకు ప్రత్యేక కలెక్షన్లు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 31తో సేల్ ముగుస్తుందని, లేపాక్షిని సందర్శించి ప్రయోజనం పొందాలని నగర ప్రజలను కోరారు. రామ్‌నగర్ వీఎంఆర్‌డీఏ కాంప్లెక్స్, విమానాశ్రయం వద్ద గల లేపాక్షి ఎంపోరియంలో వార్షిక క్లియరెన్స్ సేల్, ఉగాది సేల్ ఉంటుందని కార్తీక్‌కుమార్ వెల్లడించారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు తప్పనిసరి



వారోత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, అధికారులు

మహారాణిపేట: మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు తరచూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిడాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం వివిధ విభాగాల అధికారుల సమక్షంలో గ్లకోమా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 15 వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, 40 ఏళ్లు దాటిన అందరూ కంటి వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఇతర శిబిరాల్లో ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు కళ్లద్దాల మార్పు కోసం ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేసుకోవాలని చెప్పారు. కంటి ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మాధవి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ హారిక, ఆర్.బి.ఎస్.కె.అప్పారావు, రవిశంకర్, నాగభూషణం పాల్గొన్నారు.

సీజీహెచ్‌ఎస్ లబ్ధిదారుల ఆత్మీయ సమ్మేళనం



సభ్యులను సత్కరిస్తున్న కమిటీ మెంబర్లు

అల్లిపురం: లోకల్ ఎడ్వయిజరీ కమిటీ మెంబర్స్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రథమ ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్, ఎన్ఎస్‌టీఎల్, ఎంఈఎస్, డాక్‌యార్డు, పోస్టల్, ఇన్‌కంటాక్స్ తదితర సంస్థల రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. సమావేశాన్ని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కేవీ రామిరెడ్డి ప్రారంభించారు. సీబీడబ్ల్యూఏఐ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణమూర్తి, బీడీ రాజు, కేవీడీ స్వామి, కె.రవిబాబు, ఎంఆర్‌డీ రాజు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న జాన్‌వెస్లీ, సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ 14 ఏళ్లు వైఎస్సార్‌సీపీని ఆదరించిన రాష్ట్ర ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. అనంతరం పార్టీ శ్రేణుల ఆనందోత్సాహాల నడుమ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.

ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్య, వైద్యం, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలతోపాటు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని, హామీలను గాలికొదిలేసిందని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన యువత పోరు కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పార్టీ శ్రేణులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా కిట్ల పంపిణీ



జర్నలిస్టుల పిల్లలకు పరీక్షా కిట్లు అందిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తదితరులు

డాబాగార్డెన్స్: పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న జర్నలిస్టుల పిల్లలకు విప్పర్తి రామం–కామేశ్వరి ఆత్మీయ సేవా ఫౌండేషన్, విశ్వ చిత్రకళ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షా కిట్లు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో అందించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఆందోళన చెందకుండా ఆలోచనతో పరీక్షలు రాస్తే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. కళావేదిక గౌరవ అధ్యక్షుడు కమల్ బైద్ మాట్లాడుతూ సృజనాత్మకత ధోరణి, ధైర్యం చదువుతోనే సాధ్యమన్నారు. ఇన్‌చార్జ్ డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్‌టీవో ఎం.బుచ్చిరాజు, జాతీయ జర్నలిస్ట్స్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ నిత్యం సమాజాన్ని జాగృత పరిచే వార్తలు అందించే జర్నలిస్టుల పిల్లలు పట్టుదలతో ఉన్నత చదువులు చదువుతూ, దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తున్నారన్నారు. సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాస జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి ఏటా పరీక్షల సమయంలో జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా కిట్లు, ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 75 మంది విద్యార్థులకు పరీక్షా కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజ్ పట్నాయక్, కొణతాల శ్రీనివాస్, ఈశ్వర్, ప్రకాష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ జీతాల కోసం పడిగాపులు



జీతాల కోసం జీవీఎంసీ ప్రధాన ద్వారం వద్ద నిరీక్షిస్తున్న పారిశుధ్య కార్మికులు

డాబాగార్డెన్స్: మిస్సింగ్ జీతాల కోసం పారిశుధ్య కార్మికులు మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ద్వారం వద్ద పడిగాపులు కాశారు. జోన్ – 6 గాజువాక పరిధిలో పారిశుధ్య కార్మికుల్లో కొందరికి ప్రతి నెలా జీతాలు మిస్సింగ్ అవుతున్నాయి. గత డిసెంబర్ నెలకు సంబంధించి 64, 65, 69 వార్డుల్లో 23 మంది కార్మికులకు జీతాలు రాలేదు. అలాగే జనవరి నెలకు సంబంధించి 64, 69 వార్డుల్లో ఇద్దరికి జీతాలు రాలేదు. డే అండ్ నైట్ ప్యాకేజీ నెంబరు 24 కార్మికులకు, 2022 నుంచి 2024 వరకు మిస్సింగ్ జీతాలు, ఎంఎస్ఎఫ్, డ్రైవర్, వర్కర్స్‌కు జీతాలు రాకపోవడంతో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. జీవీఎంసీకి విచ్చేసిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్‌ను కలిసి మొర పెట్టుకునేందుకు జీవీఎంసీ ప్రధాన ద్వారం వద్ద పలువురు కార్మికులు ఇలా పడిగాపులు కాశారు. వీరితోపాటు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, నక్క నాగరాజు, కుమారి, వెంకట్రావు, ఆనంద్ ఉన్నారు.

నారీశక్తితో మరింత పురోభివృద్ధి



మహిళను సత్కరిస్తున్న సంఘ నాయకులు

డాబాగార్డెన్స్: పారిశ్రామిక, రక్షణ, సాంకేతిక రంగాల్లో నారీ శక్తిని పెంచడం వల్ల ఉత్పత్తి రంగంలో మరింత పురోభివృద్ధి సాధ్యమవుతుందని భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి పుట్టా విద్యా సాగర్ పేర్కొన్నారు. ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నేవల్ డాక్‌యార్డ్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్త్రీలు సహన శీలులు, కార్య శీలులు మాత్రమే కాదని, శక్తి స్వరూపాలని కొనియాడారు. నారీ శక్తిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా దేశంలో మహిళా సాధికారతకు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్ మాట్లాడుతూ తూర్పు నావికా దళ పరిధిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ క్వాలిటీ సర్కిల్స్ పోటీల్లో ప్రతిభ కనబరచిన ముగ్గురు మహిళా ఉద్యోగినులతోపాటు డాక్‌యార్డ్ ఉమెన్స్ ఫోరం ఉద్యోగినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు, పి.సురేష్, రెడ్డిపల్లి యోగిత, ఉమా మహేష్ శ్రీనివాస్, బి.శివ, కాసుబాబు, సీహెచ్ లక్ష్మణ్, చింతాడ రమణ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సీతమ్మధార: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25న దేశవ్యాప్తంగా సమ్మె చేపడతామని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యు.ఎఫ్.బి.యు. కన్వీనర్ ఆర్.వసంత రావు మాట్లాడుతూ అన్ని బ్యాంక్‌లలో ఖాళీలు భర్తీ చేయాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు పరచాలని, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వర్క్ మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు కమలాకర్, రమేష్, ఈశ్వర్, రామ రెడ్డి, స్వాతి సుజాత పాల్గొన్నారు.

ఎట్టకేలకు టీడీఆర్ ప్రక్రియ ప్రారంభం



జోనల్ కార్యాలయంలో సెక్రటరీలకు సూచనలిస్తున్న టీపీవో

జగదాంబ: ఎట్టకేలకు టీడీఆర్‌ల ప్రక్రియ మొదలైంది. జగదాంబ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరణ జరిగింది. ఇందుకు సంబంధించి తాత్కాలికంగా, శాశ్వతంగా భవనాలు కోల్పోయిన 277 మంది లబ్ధిదారులున్నారు. రహదారి విస్తరణకు జీవీఎంసీ ముందుకొచ్చింది కానీ.. టీడీఆర్‌లు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు జోన్–4 కార్యాలయం చుట్టూ తిరుగుతుండేవారు. ఈ నేపథ్యంలో టీడీఆర్‌లు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో జోనల్ కార్యాలయంలో ఆ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే నష్టపోయిన లబ్ధిదారులు కొంత మంది వారి డాక్యుమెంట్లు అందించారు. మిగిలిన వారు ఎవరైతే ఇవ్వలేదో వారందరి నుంచి డాక్యుమెంట్లు స్వీకరిస్తున్నారు. జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారి ఝాన్సీ ఆధ్వర్యంలో ప్లానింగ్ అధికారులు, సెక్రటరీలు పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి జోనల్ కార్యాలయంలో డాక్యుమెంట్లు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికీ ఇవ్వని వారం దరూ త్వరితగతిన వచ్చి డాక్యుమెంట్లు అందజేయాలని కోరారు.

డీఎంహెచ్‌వోతో కేంద్ర బృందం భేటీ



కేంద్ర బృంద సభ్యులకు వివరాలు తెలియజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పలు ఆరోగ్య కార్యక్రమాల నిమిత్తం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావుతో భేటీ అయింది. పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నుంచి వచ్చిన కేంద్రం బృంద సభ్యుడు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు ఆధ్వర్యంలో పలువురు సభ్యులు ఈ నెల 14 వరకు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. డీఎంహెచ్‌వోను పలు వివరాలు అడిగారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ పథకాల వివరాలను ప్రోగ్రాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వచ్చే శనివారం వరకు పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సమీక్షిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

‘యువత పోరు’ విజయవంతం చేద్దాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

- హామీలు తక్షణమే అమలు చేయాలి
- పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో యువత తరపున వైఎస్సార్ సీపీ ఈ నెల 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆశీల్‌మెట్టలో గల వాసుపల్లి కార్యాలయంలో పార్టీ దక్షిణ నియోజకవర్గ నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షల ఉద్యోగాలు యువతకు అందించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు కాగా, కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ ప్రైవేటీకరించేందుకు సిద్ధపడుతోందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వాసుపల్లి డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఉద్యోగులకు అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్‌సీ అమలు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఉన్న ఉద్యోగులకే సరిగ్గా జీతాలు ఇవ్వలేకపోతున్నారని, ఇక యువతకిచ్చిన హామీలు గాలికి వదిలేశారని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై వాసుపల్లి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగం, కక్షపూరిత రాజకీయాలు విడనాడి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, ముజీబ్‌ఖాన్, బంగారమ్మ, వెంకటరమణ, షకీల్, బెవర మహేష్, ఆకుల శ్యామ్‌కుమార్, సాగర్, కోరాడ సురేష్, బుల్లెట్ రవి, సంతోష్, రాజు, రఫీ, దుర్గ, మాలతి, నారాయణమూర్తి, శకుంతల, దుక్క గోపి, బొడ్డు ధనరాజ్, గోరపతి శివ, పడాల సూర్యకుమార్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాల్సిందే




జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ విశాఖపట్నం హార్బర్ పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ జిల్లా సమితి ఏర్పాటు చేసిన మహా ధర్నాను సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని 50 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రతతో కూడిన చట్టం రూపొందించాలని కోరారు. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారన్నారు. వాటి వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. తక్షణమే లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, గౌరవ అధ్యక్షుడు బి.సి.హెచ్.మసీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, బి.వెంకట్రావు, ఎస్కే.రెహమాన్, జె.డి.నాయుడు, జె.రామకృష్ణ, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్తిబాబు, పి.చంద్రశేఖర్, పడాల గోవిందు, సీహెచ్ కాసుబాబు, ఎస్.నాగభూషణం, ఆనంద్, జె.రాజేశ్వరి పాల్గొన్నారు.

కాలువల్లోని చెత్త తొలగించాలి

జగదాంబ : కాలువల్లోని చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని జీవీఎంసీ జోన్ – 4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ ప్రధాన రహదారిలో కాల్వలను పరిశీలించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సిబ్బందితో తీయించారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు రోజూ కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలన్నారు. ఆయనతోపాటు వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్ భద్రతకు పోలీసుల ప్రత్యేక చర్యలు



కేజీహెచ్‌లో వన్‌టౌన్ పోలీసుల పహారా

మహారాణిపేట: కేజీహెచ్‌లో భద్రత చర్యలను పోలీసులు మరింత ముమ్మరం చేశారు. ఇందుకోసం వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక గస్తీ దళాన్ని ఏర్పాటు చేసి పహారా కాస్తున్నారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నిత్యం పెట్రోలింగ్ ఏర్పాటు చేయడంతో పాటు గస్తీ విధులను మరింత కట్టుదిట్టం చేశారు. సోమవారం రాత్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడీ బాబు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బందితో కలిసి కేజీహెచ్ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారిని విచారించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కేజీహెచ్‌లోని వైద్యులు, రోగులు, వారి బంధువుల భద్రతకు ప్రత్యేకంగా పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ప్రధాన ప్రాంగణం, అత్యవసర విభాగం, బయటి ప్రదేశాల్లో నిరంతరం పోలీసు పహారా కొనసాగుతుందని సీఐ తెలిపారు. ఏ సహాయం కావాలన్నా 24/7 స్వయంగా 9440796019కు ఫోన్ చేయాలని సూచించారు.